క్లుప్తంగా

జగన్మోహినిగా భజేనారాయణస్వామి



కూర్మ, జగన్మోహిని అవతారాల్లో భజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరులోని భజేనారాయణ స్వామివారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్వామివారిని కూర్మ, జగన్మోహినీ అవతారాల్లో అలంకరించారు. స్వామివారికి ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారం వరాహ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు. ఆలయ చైర్మన్ మావిరెడ్డి నెహ్రూ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తిరన్

గోకవరం: మండలంలో ఈ నెల 18 నుంచి జరిగే రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లు తిరన్, నిఖిత కోరారు. మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ పథకం, జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు మూర్తి, శంకర్, హెచ్‌వీలు అరుణోనమ్మ, రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పెదపూడి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని మండల కమిటీ కన్వీనర్, జిల్లా ఆఫీస్ బేరర్ ఎం.రాజేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె శుక్రవారంతో నాల్గో రోజుకు చేరింది. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రం అందజేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం



పందలపాకలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద భోజనం చేస్తున్న చిన్నారులు

బిక్కవోలు: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుండటంతో మూతబడిన కేంద్రాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తెరిచారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని 70 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం అందించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు పర్యవేక్షించారు. అయితే బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది.

రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా గుప్తా



గుప్తాను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రంగంపేట: అనపర్తి రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా రంగంపేట మండలానికి చెందిన బీజేపీ నాయకుడు మండవిల్లి గుప్తా నియమితులయ్యారు. దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ఈ ఉత్తర్వులు ఇచ్చిందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ అనపర్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి, ప్రయాణికులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. గుప్తాను నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎంఎస్ఆర్‌కే రాజు, నాయకులు మాణిక్యం, చీపురు ఆంజనేయులు, పేపకాయల రామచంద్రరావు అభినందించారు.

వికసిత్ భారత్ యాత్ర

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కలిగిస్తూ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శుక్రవారం కొత్త తుంగపాడులో జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సర్పంచ్ కోలపాటి వెంకన్న, బీజేపీ నాయకులు మోది సత్తిబాబు, కాలేపు సత్యసాయిరామ్, అడబాల గణపతిరావు, అడబాల రామకృష్ణ, దొడ్డా శ్రీను పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా నరసన్న క్షేత్రం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



స్వామివారి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండలో స్వామివారి గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొబ్బరి కాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి గిరి ప్రదక్షిణను ఎమ్మెల్యే రాజా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవ మూర్తుల పల్లకీని మోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేశామన్నారు. రూ.40 లక్షల రుడా నిధులతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ మార్గం నిర్మాణాన్ని పూర్తి చేయడం సంతృప్తికరంగా ఉందన్నారు. స్వామివారి దివ్యాశీసులతో కోరుకొండలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్న విషయాన్ని వెల్లడించారు. స్వామివారి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని, రూ.90 లక్షలతో కొండపైన రాజగోపురం, రూ.20 లక్షలతో రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. దీనికి త్వరలో త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతులమీదుగా శంకుస్థాపన చేస్తామన్నారు. భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రూ.100 కోట్లతో కొండపైన, కింద భవనాలు, ఆలయ అభివృద్ధి పనులు నిర్వహించేందుకు, ఇప్పటికే నిర్మించిన భక్తుల వసతి భవనాన్ని త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అన్నవరం దేవస్థానం ఏసీ డీఎల్వీ రమేష్ బాబు, డిప్యూటీ ఇంజినీర్ పి.గుర్రాజు, జెడ్పీటీసీలు కర్రి నాగేశ్వరరావు, వాసంశెట్టి పెద్ద వెంకన్న, మండల కన్వీనర్లు గణేశుల పోసి, దూలం పెద్ద, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, కడియాల నానాజీ, బొరుసు బద్రి, బొండాడ చందు, మద్దాల రమణ, అనువంశిక ధర్మకర్త రంగరాజ బట్టర్ పాల్గొన్నారు.

నేడు మెగా క్రిస్మస్ వేడుకలు

మధురపూడి: బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో సీతానగరం మండలం మిర్తిపాడులో శనివారం మెగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆ మిషన్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ ఎస్‌జీ ఆనంద్ పాల్ తెలిపారు. ఆయన శుక్రవారం కోరుకొండలో మాట్లాడుతూ షాలోము స్వస్థత శాల ఆవరణంలో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వాక్య సందేశకులుగా బిషప్ డాక్టర్ ఎన్.విజయరాజు, అతిథులుగా యూసీఏ అధ్యక్షుడు సీహెచ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎన్.ఆనందకుమార్, ముఖ్య సలహాదారులు వి.ప్రసన్నకుమార్ పాల్గొంటారన్నారు.

క్రీస్తు బోధనలు మార్గదర్శకం



అనపర్తిలో క్రిస్మస్ వేడుకల్లో డాక్టర్ తాడి రామగుర్రెడ్డి తదితరులు

అనపర్తి: క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని అనపర్తి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆసుపత్రి టెర్రస్‌పై క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ టి.రామగుర్రెడ్డి, వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభువు చూపిన శాంతి, దయ, కరుణ గుణాలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కేబీవీవీఎస్ఎన్ రెడ్డి, జి.లక్ష్మీదుర్గ, బి.ఉమాశంకర్, ఆసుపత్రి వైద్యులు పద్మశ్రీ, చంద్రశేఖర్, సునీల్‌రాజు, ప్రదీప్ సుందర్, డేవిడ్‌రతన్, జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



రఘుదేవపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- అర్హులందరికీ లబ్ధి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రఘుదేవపురంలో ఐదో రోజు శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ దేవత చింతాలమ్మను దర్శించిన అనంతరం కార్యక్రమాన్ని కొనసాగించారు.

వినతుల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ మన ప్రభుత్వంలో అర్హత గల వారిని వెతుక్కుంటూ మరీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీల సైతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. గడప గడపలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా.. తన ఎనిమిదిన్నర ఎకరాల వరి పంట ముంపులోకి వెళ్లి, మొలకెత్తిందని ఎమ్మెల్యే రాజా వద్ద రైతు సానే లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఏవో సూర్య రమేష్‌ను రప్పించి జరిగిన నష్టంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ ఇండుగుమిల్లి చంద్రలీల, ఉపసర్పంచ్ పట్టపగలు విష్ణుప్రసాద్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, గెద్దాడ త్రిమూర్తులు, యలమాటి కాశీ, పంతులు శ్రీను, గెడ్డం రాజు, దాసరి బాబీ, కాండ్రు వెంకటరాజు, పరిమి కర్ణాలరాజు, పాలచర్ల అచ్యుత రామారావు, సుంకర సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: స్థానికంగా షష్ఠి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ వరకూ ఆలయంలో షష్ఠి ఉత్సవాలు జరుగుతాయన్నారు. గత ఏడాది సుమారు రెండు లక్షల మంది భక్తులు వచ్చారని, ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పోలీసు బందోబస్తు ఎక్కువగా ఉండాలన్నారు. పారిశుద్ధ్య సమస్య రాకుండా చూడాలన్నారు. షష్ఠి రోజు వలంటీర్ల సహాయం తీసుకోవాలన్నారు. వైద్య, పోలీసు, అగ్నిమాపక తదితర అధికారులు ఎక్కడా లోపాలు లేకుండా చూడాలన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల ఆవరణలో భారీ గేటు ఏర్పాటు చేయాలని, దీనివల్ల బాణసంచా పోటీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యుడు డాక్టర్ జంగా మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ సుమలత, వైస్ ఎంపీపీ బుద్ధాల కన్నారావు, శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, యమసాని రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

రాజానగరం: శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు మహిళలకు సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాత తుంగపాడుకు చెందిన 70 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. పూర్తి చేసిన వారికి దివాన్ చెరువులోని ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, వినీల, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికే పాఠాలు నేర్పిన వ్యవస్థ మనది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచానికే పాఠాలు నేర్పిన వ్యవస్థ మనకు రామాయణ కాలం నాటికే ఉండేదని ప్రవచన విరించి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ సమాజంలో మూడో రోజు శుక్రవారం ఆయన ఆదర్శ పాలకుడి లక్షణాలు, అయోధ్యా నగర వైభవాన్ని వివరించారు. ఆదర్శవంతమైన రాజనీతి శాస్త్రం, అర్థ శాస్త్రం, గూఢచారి వ్యవస్థ ఎలా ఉండాలి తదితర అంశాలన్నీ నాటి పాలనలో చూడవచ్చన్నారు. అందుకనే ఒక విదేశీయుడు గ్రంథాలయాలన్నీ తగలబడి పోయినా, రామాయణం ఒక్కటి మిగిలితే చాలని వ్యాఖ్యానించాడన్నారు. దేశాభ్యున్నతి ప్రజల సంపదపై కాదు, సంస్కారంపై ఆధారపడి ఉంటుందన్నారు. దశరథునిలో ఆదర్శ పాలకుని లక్షణాలను చూడవచ్చునన్నారు. కథాపరంగా, అశ్వమేధ యాగం జరిగిన తీరుతెన్నులను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

కంబాలచెరువు: ప్రజల మాన, ప్రాణ, రక్షణే పోలీసుల ధ్యేయమని, దానికి అందరం కలిసి కట్టుగా పనిచేయాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది నిర్వహించిన పెరేడ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొవడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. సిబ్బందికి ప్రతి శుక్రవారం పెరేడ్ నిర్వహించి అందరికీ అన్ని విభాగాలపై విషయాలలో అవగాహన కల్పించాలన్నారు. శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చెంచిరెడ్డి, ఆర్ఐలు యు.శ్రీనివాసరావు, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

త్యాగధనుడు పొట్టి శ్రీరాములు



పెదపూడిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ సాయిబాబు తదితరులు



కొంకుదురులో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రాజానగరంలో పొట్టి శ్రీరాములుకు నివాళి


పెదపూడి: త్యాగజీవి పొట్టి శ్రీరాములని ఎంపీడీఓ సాయిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ శ్రీరాములు ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి పాల్పడ్డారన్నారు. ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఏఓ చలమయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసు, సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల కౌమర విద్యా రిసోర్స్‌పర్సన్ కంభంపాటి అప్పారావు, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ నూకరాజు, ఉపాధ్యాయులు కృష్ణసాయి, ఈశ్వరరెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

అమరజీవి ఆశయాలు నెరవేరుద్దాం

రాజానగరం: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్యవైశ్యులు పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. మండవల్లి వెంకన్నబాబు, సముద్రాల రాంబాబు, గ్రంధి రాజా, గ్రంధి సత్తిబాబు, దవులూరి గిరిబాబు, పాలూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



పందలపాకలో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



బూరుగుపూడిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

బిక్కవోలు: పేదలకు పథకాలు అమలు చేస్తూ.. సంక్షేమ సారథిలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరొందారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. శుక్రవారం పందలపాక సచివాలయం-2 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జెండా సెంటర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలోనూ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వంలో అర్హుల ఇంటికే పథకాలు చేరుతున్నాయన్నారు. ఈ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు మచ్చా పాప, సొసైటీ డైరెక్టర్ పడాల వీరాఘవరెడ్డి, గండి వాసు, పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల లబ్ధి

మధురపూడి: ముఖ్యమంత్రి జగన్ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి పారదర్శకంగా అందుతోందని జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం లేదన్నారు. జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ, బూరుగుపూడి మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టా కృష్ణ, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకా నెహ్రూ రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుద్దిగ సత్తిబాబు, పార్టీ నాయకులు ఏవీఎస్ఎస్ మూర్తి, దున్నా రాజు, ఏడిద పండు, అడపా రామకృష్ణ, కొవ్వాడి రాజు పాల్గొన్నారు.

రైల్వే అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా సతీష్

రాజానగరం: రైల్వే అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా లాలాచెరువు హెచ్‌బీ కాలనీకి చెందిన బొమ్ముల సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కడియం రైల్వే స్టేషన్ మాస్టార్‌కు తన డిక్లరేషన్‌ను అందజేశారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కారకులైన పార్టీ పెద్దలకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

హక్కులపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: వినియోగదారుల హక్కులను పాఠ్యాంశంలో చేర్చాలని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంత రావు అన్నారు. హుకుంపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం కన్జ్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులను తెలుసుకుంటే సమస్యల పరిష్కారం సులభమవుతుందన్నారు.

తుపాను బాధితులకు ప్రభుత్వ సాయం



రఘుదేవపురంలో ప్రభుత్వ సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మిచాంగ్ తుపానుతో కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి 11 మందికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వ సాయాన్ని ఆయన శుక్రవారం రఘుదేవపురం సచివాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సాయం అందించడంలో వెనకడుగు వేస్తే, నేడు జగనన్న పాలనలో బాధితులను తక్షణమే ఆదుకునే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సింగవరానికి చెందిన బుగ్గ మరియమ్మ, మర్రే ప్రభుదాసు, నిందురు వెంకటలక్ష్మి, రఘుదేవపురానికి చెందిన గంగాధర రమణ, గెద్దా వెంకయ్యమ్మ, నల్గొండకు చెందిన గుత్తి లక్ష్మి, నక్క విక్టోరియమ్మ, చిన్నకొండేపూడికి చెందిన దొంత గొట్టిమ్మ, సన్నపుడి బెత్తాయమ్మ, ధర్మపురి నాగేశ్వరరావు, భూపతి సత్యనారాయణ రాజుకు రూ.10 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రలీల, ఉపసర్పంచ్ పట్టపగలు విష్ణుప్రసాద్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీ రాజు, చుండ్రు శ్రీను, నిడదవోలు శ్రీనివాస్, వట్టకూటి లచ్చారావు, పిండి రాధాకృష్ణ, మట్ట శ్రీను, తిర్నాతి చిన్న, గుమ్మడి రాజు, గెద్దాడ త్రిమూర్తులు, ఆర్‌వి లక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురత్రయంలో అగ్ని ప్రమాదం

మూడు తాటాకిళ్లు దగ్ధం



అచ్యుతాపురత్రయంలో కాలిపోతున్న ఇళ్లు

పెదపూడి: అచ్యుతాపురత్రయం గ్రామంలో జరిగిన ప్రమాదంలో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. తహసీల్దార్ టి.సుభాష్ కథనం ప్రకారం.. అచ్యుతాపురత్రయం పశ్చిమ ఏలూరు వంతెన గట్టుపై బొడ్డు దుర్గా, కొల్లి ధనలక్ష్మి, కొల్లి వీరయ్యకు చెందిన మూడు కుటుంబాలు తాటాకిళ్లలో జీవిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం ధనలక్ష్మి ఇంటి వద్ద కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదశాత్తు మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ మంటలు పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లకు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. ఇళ్లలోని వారు బయటకు పరుగులు తియ్యడంతో ప్రమాదం తప్పింది. ఆ ఇళ్లలోని సామగ్రి, సంక్షేమ పథకాల ధ్రువపత్రాలు, నగదు కాలిపోయారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సమాచారం తెలుసుకున్న కాకినాడ అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. తహసీల్దార్ స్థానిక వీఆర్వో అంజిబాబు సంఘటనా స్థలంలో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు చంద్రన్న

రంగంపేట: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న అన్నారు. శుక్రవారం రంగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖాధికారి-1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల మేధో సంపదను పెంచడానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ఎంపీటీసీ సభ్యురాలు మట్టపర్తి సూర్యకుమారి అభినందించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి-2 పి.మధుసూదనరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.